www.prajasakti.com

# ప్రజాశక్తి

ఆదివారం 4 జనవరి 2026

5

పశ్చిమ గోదావరి

## బాలికల విద్యకు సావిత్రి బాయి పూలే కృషి



పోడూరులో ఉపాధ్యాయినులకు సత్కారం

వార్తలో ఆరో పేజీలో..

# కన్ను తెరవని.. పసి ప్రాణాలు..!

- 3 నెలల్లో 47 శిశు మరణాలు, ఒక మాతృ మరణం
- ప్రతి వెయ్యి ప్రసవాల్లో 9 పసి ప్రాణాలు మృత్యుఒడిలోకి
- జీరో స్థాయికి తీసుకురావడలో ప్రభుత్వం విఫలం
- పౌష్టికాహార లోపంతోపాటు కారణాలెన్నో
- పేద కుటుంబాల్లోనే శిశుమరణాలు అత్యధికం
- మాతా, శిశు మరణాలపై అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

వైద్య రంగంలో టెక్నాలజీ పెరిగినా మాతా, శిశుమరణాలను జీరో స్థాయికి తీసుకురావడంలో ప్రభుత్వం విఫలమైన పరిస్థితి నెలకొంది. జిల్లాలో మాతా, శిశు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. జులై నుంచి సెప్టెంబర్ వరకూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా 47 శిశు ప్రాణాలు కన్ను తెరవకుండానే గాలిలో కలిసిపోయిన పరిస్థితి నెలకొనగా ఒక మాతృ మరణం సైతం సంభవించిన పరిస్థితి నెలకొంది. వైద్య ఆరోగ్యశాఖ సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాతా, శిశుమరణాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన పరిస్థితి. మాతా, శిశు మరణాల అడ్డుకట్టకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించిన పరిస్థితి నెలకొంది. శిశు మరణాలు రాష్ట్ర సగటు కంటే జిల్లాలో తక్కువగా ఉన్నప్పటికీ టెక్నాలజీ ఇంత అభివృద్ధి చెందిన తర్వాత సైతం ఇంకా శిశుమరణాలు పెద్ద ఎత్తున జరుగుతున్న తీరు అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. జిల్లాలో ప్రతినెలా 1500 నుంచి రెండు వేల ప్రసవాల వరకూ జరుగుతున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 40 శాతం ప్రసవాలు జరుగుతుండగా, ప్రయివేటులో 60 శాతం వరకూ జరుగుతున్నాయి. సాధారణ ప్రసవాలకంటే అత్యధికంగా ఆపరేషన్ ద్వారానే ఎక్కువగా సాగుతున్న పరిస్థితి. అత్యవసర సమయంలో మాత్రమే ఆపరేషన్లు చేయాల్సి ఉన్నప్పటికీ సొమ్ముల కోసం ప్రయివేటు ఆసుపత్రుల్లో గర్భిణులకు విచ్చలవిడిగా ఆపరేషన్లు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వాసుపత్రుల్లో జరిగే ప్రసవాల్లో ఆపరేషన్ల సంఖ్య 55 శాతం ఉండగా, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఆ సంఖ్య 65 శాతం వరకూ ఉన్నాయి. అయినప్పటికీ మాతా, శిశుమరణాల నమోదు ఎక్కువగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వైద్యశాఖ అధికారులు మాత్రం మాతా, శిశుమరణాలకు అనేక కారాణాలు ఉన్నట్లు చెబుతున్నారు. రాష్ట్రంలో సగటున ప్రతి వెయ్యి ప్రసవాల్లో 25 వరకూ శిశుమరణాలు జరుగుతుండగా జిల్లాలో ఆ సంఖ్య తొమ్మిది వరకూ ఉందని వైద్య శాఖ చెబుతోంది. వైద్య రంగం పెద్ద ఎత్తున అభివృద్ధి చెందిన తర్వాత సైతం ఇంకా మాతా, శిశుమరణాలు కొనసాగడం ఏంటన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది.

**పౌష్టికాహారంతో పాటు, అనేక కారణాలు**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు చెబుతున్నా ఇంకా అనేక పేద కుటుంబాలకు చెందిన గర్భిణుల్లో పౌష్టికాహార లోపం వేధిస్తోంది. దీంతో బిడ్డ పెరుగుదల లేకపోవడం శిశు మరణాలకు కారణంగా తెలుస్తోంది. కొన్ని వంశపారం పర్యంగా వచ్చే వ్యాధులను గుర్తించడంలోనూ విఫలమవుతున్న పరిస్థితి నెలకొంది. గర్భిణీ సమయంలో పేద కుటుంబాలకు చెందిన మహిళలకు సరైన వసతులు లేకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. గిరిజన, దళిత కుటుంబాల్లో ఇల్లు గడవడం కష్టంగా మారడంతో నెలలు నిండే వరకూ పనులకు వెళ్లడం, ఆ సందర్భంలో ఎక్కువ దూరం ప్రయాణాలు చేయడం వంటి కారణాలు సైతం మాతా, శిశు మరణాలకు కారణంగా కనిపిస్తోంది. పేద కుటుంబాలకు చెందిన గర్భిణులను ఆర్థికంగా ఆదుకునే విధంగా సరైన చర్యలు లేకుండా పోయాయి. గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గర్భిణులను గుర్తిస్తున్నా నిరంతర పర్యవేక్షణ, శ్రద్ధ తీసుకోవడంలో ఆరోగ్య శాఖ విఫలమవుతోందన్న విమర్శలు ఉన్నాయి. గర్భిణులను గుర్తించిన తర్వాత ప్రతి రోజూ ఎటువంటి ఆహారం తీసుకుంటున్నారు. బరువు ఎంత ఉన్నారు. ఎటువంటి ఆహారం తీసుకోవాలో గర్భిణులకు అవగాహన కల్పించకపోవడం, ప్రసవ సమయంలో ముందుగానే సరైన జాగ్రత్తలు తీసుకోవడంలో వైద్యశాఖ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రతినెలా చెకప్‌లో సమస్యలు గుర్తించడంలో ఆరోగ్యశాఖ విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. కేరళ వంటి రాష్ట్రంలో మాతా, శిశుమరణాలు జీరో స్థాయిలో ఉన్నాయి. అటువంటి పరిస్థితి రాష్ట్రంలో రావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా దళిత, గిరిజన వెనుకబడిన సామాజిక తరగతి ప్రజానీకంపై ఎక్కువగా దృష్టి సారించాల్సి ఉంది. అప్పుడే జీరో స్థాయిలో మాతా, శిశుమరణాలు సాధ్యం అవుతాయి. దీనికి జిల్లా వైద్యశాఖ మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ నాగరాణి

# ఘనంగా ప్రభుత్వ ఉద్యోగుల క్రీడా సంబరాలు

## గోదావరి క్రీడా ఉత్సవాలను ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం : కలెక్టర్

**ప్రజాశక్తి - భీమవరం**

భీమవరం డిఎన్‌ఆర్ కళాశాల ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన గోదావరి క్రీడా ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ ఉద్యోగుల జిల్లా స్థాయి పోటీలను కలెక్టర్ చదలవాడ నాగరాణి కీడాజ్యోతిని వెలిగించి వైభవంగా ప్రారంభించారు. మండల, డివిజన్ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన బృందాలు జిల్లా స్థాయిలో తలపడనున్నాయి. శని, ఆదివారాల్లో క్రికెట్, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, టెన్ని కాయిట్, త్రో బాల్, క్యారమ్స్, షాట్ పుట్ వంటి 9 క్రీడాంశాల్లో 235 బృందాలు, అథ్లెటిక్స్ 56 మందితో పోటీలు నిర్వహించనున్నారు. తొలుత క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడా పరుగుతో కలెక్టర్ నాగరాణి జెసి రాహుల్ కుమార్ రెడ్డికి అందించగా వారు ఒక్కొక్క జిల్లా అధికారికి అందిస్తూ చివరికి క్రీడాజ్యోతి కలెక్టర్ వద్దకు చేరింది. అనంతరం క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు డిఎస్‌డిఒ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ శారీరక, మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఉద్యోగంలో చరవాణి ముఖ్య భూమిక పోషిస్తోందని, గతంలో కార్యాలయం విడిచి వెళ్లి, మరుసటి రోజు కార్యాలయానికి వచ్చే వరకూ ఎక్కువ శాఖల ఉద్యోగులు విధులకు దూరంగా కుటుంబంతో ఉల్లాసంగా ఉండేవారన్నారు. నేడు సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో టెక్నాలజీతో మనమంతా మమేకమై సమయంతో నిమిత్తం లేకుండా ఎక్కడ ఉన్నా చరవాణితో విధులు నిర్వర్తించడం తప్పని పరిస్థితి అన్నారు. ఇంత ఒత్తిడిలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఆటవిడుపు, శాఖల మధ్య మంచి స్నేహపూరిత వాతావరణం పెంపొందేలా జిల్లాలో మాత్రమే గోదావరి క్రీడోత్సవాలను జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో రూపొందించడం జరిగిందన్నారు. జెసి మాట్లాడారు. కలెక్టర్, జెసి బ్యాటింగ్ చేయగా జిల్లా కలెక్టర్ కుమారుడు చదలవాడ భరత్ బౌలింగ్ చేశారు. అనంతరం వాలీబాల్, టెన్ని కాయిట్ స్వయంగా ఆడి క్రీడలను ప్రారంభించారు. డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఖతీబ్ కౌసర్ భానో, దాసిరాజు, అధికారులు పాల్గొన్నారు.

# సెల్ టవర్ ఎక్కి పాస్టర్ నిరసన

## చెరువుగట్టుపై ఇళ్లు తొలగించడంపై మహిళల రాస్తారోకో - అధికారుల హామీతో విరమణ : ఆరున్నర గంటల పాటు ఉద్రిక్తత

**ప్రజాశక్తి - ఆకివీడు**

ధర్మాపురం చెరువు గట్టుపై ఇళ్లు తొలగింపుపై పిల్లలమర్రి అగ్రహారంలో ఉన్న సెట్ టవర్ ఎక్కి కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన పాస్టర్ ఇస్మాయేల్ నిరసన తెలిపారు. సమస్యను పరిష్కరించకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని సెల్ఫీ వీడియో విడుదల చేశారు. ముందుగా స్థానిక జాతీయ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి అక్కడ నుంచి బయలుదేరి నగర పంచాయతీ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలియజేసేందుకు ప్రయత్నించగా పోలీసులు నిరాకరించడంతో పాస్టర్ సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. దీనికి క్రిస్టియన్ మైనార్టీ దళిత అసోసియేషన్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ నేపథ్యంలో బాధిత మహిళలు సైతం రాస్తారోకో నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోంది. ఈ క్రమంలో సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు బందోబస్తు నిర్వహించి బాధితులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయితే డిఆర్ఒ బిఎస్‌ఎన్.రెడ్డి ఫోన్లో ఆందోళన కారులతో మాట్లాడారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్లో సమస్యను చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆదోళనకారులు రాస్తోరోకో విరమించారు. అనంతరం పాస్టర్ కిందకు దిగడంతో వాతావరణం చల్లబడింది. రాస్తారోకో నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు.

రాస్తారోకో చేస్తున్న మహిళలు, నేతలు

పాస్టర్ ఎక్కిన సెల్‌టవర్

# విద్యార్థులు ఆలోచనలకు పదును పెట్టాలి

## నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ రమణారావు

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

విజయాలే లక్ష్యంగా విద్యార్థులు వ్యూహాలకు పదును పెట్టాలని ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్‌వి.రమణారావు సూచించారు. నిట్, ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసి) సంయుక్త ఆధ్వర్యంలో, ఎంఎస్‌ఎంఇ టెక్నాలజీ సెంటర్ (విశాఖపట్నం) సహకారంతో, ఎంఎస్‌ఎంఇ డిసి ఆర్‌ఎంపి పథకం కింద ఈ నెల 20వ తేదీ నుంచి 20 రోజుల పాటు నిర్వహించనున్న ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (వ్యాపార స్థాపన, నైపుణ్యాభివ ద్ధి కార్యక్రమం) పోస్టర్‌ను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు సృజనశీల వ్యాపార ఆలోచనలకు ఆకృతినిస్తే అంకుర పరిశ్రమలు రూపుదిద్దుకుంటాయని చెప్పారు. విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, ఉన్నత విద్యావంతులుగా ఎదగడానికి విద్యాలయాలు చక్కటి వేదికలని తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. విభిన్న ఆలోచనలు, ప్రాజెక్టులతో ముందుకొచ్చే విద్యార్థులను సంస్థ ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ, కార్యక్రమం ఛైర్మన్ జి.రవికిరణ్ శాస్త్రి మాట్లాడుతూ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను నైపుణ్యవంతులుగా తీర్చదిద్దడానికి ఇటువంటి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.దినేష్ శంకర్ రెడ్డి, డీన్లు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ ఎన్.జయరామ్, డాక్టర్ వీరేశ్ కుమార్, డాక్టర్ హిమబిందు, ఆచార్యులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిట్ యాజమాన్యం

# కార్మికుల శక్తేంటో విశాఖలో చూపిస్తాం..

## నేడు సిఐటియు బహిరంగ సభకు తరలిరండి

## సిఐటియు జిల్లా నేతలు

తణుకు : ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నేతలు

**ప్రజాశక్తి - తణుకు**

కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న పాలకులకు కార్మికుల శక్తి ఏమిటో నేడు విశాఖలో చూపిస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. శనివారం స్థానిక రాష్ట్రపతి రోడ్డులో నేడు విశాఖలో జరిగే కార్మిక బహిరంగ సభ విజయవంతం కావాలని సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రయివేటీకరణ ఆపాలని, ఫిబ్రవరి 12న జరిగే జాతీయ సమ్మె జయప్రదం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తే కొనుగోలు శక్తి పెరుగుతుందన్నారు. సంపద మొత్తం కొంతమంది వద్ద పోగు పడిపోవడం వలనే వ్యాపారాలు ముందుకి సాగడం లేదని అన్నారు. నూటికి 80 శాతం ఉన్న ప్రజల దగ్గర డబ్బులు లేకపోవడం వల్ల తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్తగా ఎన్ని పరిశ్రమలు వచ్చినా ప్రజల దగ్గర కొనుగోలు శక్తి లేకపోతే సంక్షోభాలు వస్తాయని తెలిపారు. కార్మికుల శ్రమ ద్వారా మాత్రమే సంపద వస్తుందని, అలాంటి కార్మికులకు పనికి తగిన ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు అంటే కొంతమందికి బానిసలుగా అన్నట్టు ఆలోచించే వారికి 2026లో ఐక్య పోరాటాల ద్వారా గుణపాఠం నేర్పుతామని ప్రతాప్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అడగర్ల అజయ కుమారి, ఎన్.ఆదినారాయణ బాబు, ఎ.కృష్ణబాబు, పి.జ్యోతి బాబు, మందులయ్య, కొమర రాణి, ఎం. గంగాధర్ రెడ్డి, రమేష్, కాకి రమణ, జి.లక్ష్మి, నాగరాజు, సోము పద్మ పాల్గొన్నారు.

పెనుమంట్ర : విశాఖపట్నంలో ఈనెల 4వ తేదీ ఆదివారం జరగనున్న సిఐటియు అఖిల భారత స్థాయి బహిరంగ సభ జయప్రదం చేయాలని సిఐటియు కన్వీనర్ చిత్ర రంజన్, కో కన్వీనర్ పి.ప్రశాంతి కోరారు. శనివారం మండలంలోని మార్టేరులో ఉన్న ఆచార్య ఎన్‌జి రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రాంగణంలో స్థానిక ఫారం కార్మికులు మహాసభల కరపత్రాలు ప్రదర్శన చేశారు. మార్టేరు, పరిసర ప్రాంతాల నుండి నాలుగవ తేదీన ఉదయం బయలు దేరి విశాఖపట్నం లో ప్రదర్శనకు, బహిరంగ సభకు వెళ్లాలని వారంతా నిర్ణయించినట్టు తెలిపారు.

పెనుమంట్రలో కరపత్రాలు ప్రదర్శిస్తున్న కార్మికులు, నేతలు

# విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి - కాళ్ల**

విద్యుత్ సబ్ స్టేషన్ జరిగితే పలు గ్రామాలతో పాటు ఆక్వా చెరువులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అవకాశం ఉంటుందని ఎపి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. కోలనపల్లి గ్రామంలో రూ.3.49 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న 5 మెగా వాట్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌కి ఆయన, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొనకంచి సూర్యనారాయణ మూర్తి, ఎంపిటిసి వేగేశ్న సత్యనారాయణరాజు, ఉప సర్పంచి వేగేశ్న నారాయణరాజు, క్లస్టర్ ఇన్‌ఛార్జి పెన్మెత్స విశ్వనాథరాజు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**రోడ్ల నిర్మాణానికి భూమి పూజ**

సీసలి-కోమటిగుంట ఆర్‌అండ్‌బి రోడ్డు నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు శనివారం భూమి పూజ చేశారు. 4 గ్రామాలను కలుపుతూ వెళ్లే రోడ్ ఇది. రూ.2 కోట్ల ముప్పై ఐదు లక్షల వ్యయంతో నిర్మించే ఆరు కిలోమీటర్ల బ్లాక్ టాప్, సీసీ రోడ్ ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సీసలి సర్పంచి బి.ధనలక్ష్మి, మాజీ సర్పంచి కట్రేడ్డి శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షులు నూకల భోగేంద్రబాబు, డిసి ఛైర్మన్ తోట ఫణిబాబు, మంతెన నాగ ఆంజనేయులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

# ఎస్ఆర్‌కెఆర్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

## ప్రముఖ గాయని స్మిత 'భీమవరం బీట్ సాంగ్ 'ఆవిష్కరణ

**ప్రజాశక్తి - భీమవరం టౌన్**

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా భోగిమంట వేసి ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులు భోగిమంట చుట్టూ కోలాటం చేస్తూ పాటలతో మైమరిపించారు. నేపథ్య గాయని స్మిత, డైరెక్టర్ విజయ బిన్నీ మాస్టర్ విద్యార్థులతో కలిసి నృత్యాలు చేస్తూ కోలాటం చేశారు. అందరినీ అలరించారు. డుడు బసవన్నల నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా భీమవరం బీట్ సాంగ్‌ను లాంచ్ చేశారు. పాట ఆద్యాంతం ప్రేక్షకులను ఆకట్టుకుంది. పాటలో అభినయం చేసిన రఘురామ కృష్ణరాజు స్మిత భీమవరం బీట్ సాంగ్‌లో డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు కూడా కొద్ది సెకండ్లు పాటు తనదైన శైలిలో సాంగ్‌లు అభినయం చేసి అందర్నీ ఆశ్చర్య చేశారు. సాంగ్ ఆవిష్కరణ తర్వాత స్మిత టీం నృత్యాలు చేస్తుండగా మధ్యలో కూడా రఘురామ కృష్ణరాజు పాట అనుగుణంగా అభినయం చేస్తూ అందర్నీ ఆశ్చర్య చకుతులను చేశారు. ఈ సందర్భంగా స్మిత మాట్లాడుతూ భీమవరం బీట్ సాంగ్‌లో రఘురామ కృష్ణరాజు కొన్ని సన్నివేశాలు ఉన్నాయని అవి మధ్యలో కుటుంబ సభ్యుల కోరిక మేరకు తొలగించడం జరిగిందని నవ్వుతూ చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తరపున డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు చేతుల మీదుగా సినీ నేపథ్య గాయకురాలు స్మితను ఘనంగా సత్కరించారు.

# భూ రికార్డుల్లో తప్పులుంటే సరిచేసుకోవాలి

## జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

**ప్రజాశక్తి - గణపవరం**

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో భూ రికార్డుల్లో తప్పులు సరిచేసి రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు ఈ నెల 9వ తేదీ వరకూ రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం చిలకంపాడు స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన పట్టాదారు పాసు పుస్తకాలు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామంలో షెడ్యూల్ ప్రకటించిన తేదీల ప్రకారం గ్రామ సభలు నిర్వహించి ప్రజాప్రతినిధుల సమక్షంలో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ సేవలు ప్రజల ముంగిటకే వచ్చి అందిస్తున్నట్లు చెప్పారు. పాతవి రెవెన్యూ అధికారులకు అందజేసి కొత్త పుస్తకాలు పొందాలన్నారు. ఇచ్చిన పుస్తకాల్లో మీ వివరాలు సరిగ్గా ఉన్నాయా లేదా అని పరిశీలించుకోవాలన్నారు. తప్పులు ఉంటే సరిచేసుకోవటానికి అవకాశం ఉటుందని చెప్పారు. పట్టాదారు పాసుపుస్తకాలకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. అనంతరం గ్రామంలో 20 మంది రైతులకు పాస్ పుస్తకాలు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజుతో కలిసి అందజేరు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ వైకెవి.అప్పారావు, డిటి విజయరత్నం, విఆర్ఒ మాలతి పాల్గొన్నారు.

# విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

విద్యార్థులు చదువుపై దృష్టిని సారించి, కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎక్సైజ్ సిఐ స్వరాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు, డ్రగ్స్‌కు ఆకర్షితులు అవ్వకుండా ఉండాలన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సమాజంలో వారి యెడల కలిగే అగౌరవం తదితర విషయాలపై ఆమె విద్యార్థులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దొరబాబు, సిబ్బంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుని ఎ.అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పాలకొల్లు :** గంజాయి, నాటుసారా, డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యాన పాలకొల్లు విశ్వ కళాశాలలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వల్ల మానవుల ఆరోగ్యం, మానసిక స్థితిపై కలిగే చెడు ప్రభావాల గురించి సిఐ మద్దాల శ్రీనివాసరావు వివరించారు. సమాజంపై అవి ఎటువంటి దుష్ప్రభావాలు కలుగజేస్తాయో అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్, ఎక్సైజ్ ఎస్ఐ మహేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : మాట్లాడుతున్న సిఐ

## రైతు బాంధవుడు సూర్యనారాయణరాజు జయంతి

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి వ్యవస్థాపకులు, పోలవరం ప్రాజెక్టు సాధన కమిటీ ఛైర్మన్, కృష్ణా డెల్టా పరిరక్షణ సమితి ఉద్యమ నాయకులు ఎంవి.సూర్యనారాయణరాజు రైతుల వెన్నంటే ఉన్న మహోన్నత వ్యక్తి అని రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ అన్నారు. ఏలూరుపాడు గ్రామంలో మంతెన వెంకట సూర్యనారాయణరాజు 96వ జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి వర్మ మాట్లాడుతూ రైతుల కోసం ఆయన చేసిన సేవలను వివరించారు. కొల్లేరు అభయారణ్య పరిరక్షణ రైతుల కోసం 46 ఏళ్లపాటు అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. రైతు పక్షపాతిగా నిరంతరం రైతుల అభ్యున్నతి కోసం పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఏలూరుపాడు గ్రామంలో ఉన్న పారిశుధ్య కార్మికులకు నూతన దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంతెన వెంకట సూర్యనారాయణరాజు మనవరాలు హిమదుర్గ, ఉమా శ్రీలక్ష్మి జనసేన నాయకులు యర్రా రవికుమార్ పాల్గొన్నారు.


నూతన దుస్తులు అందజేస్తున్న రవివర్మ కుటుంబం

భోజనం వడ్డిస్తున్న లయన్స్ సభ్యులు

## పేదలకు ఆహారం, పండ్లు వితరణ

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం సరిపల్లి కళ్యాణ మండపం వద్ద పేదలకు ఆహారం, పళ్ల వితరణ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు వెలంకి రమేష్ మాట్లాడుతూ హంగర్ సర్వీస్ వీక్‌లో భాగంగా పేదలకు ఆహారం, పళ్లు అందచేయటం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి, జోన్ ఛైర్‌పర్సన్ రావూరి నాగరాజు, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

## చంద్రన్న సంచార చికిత్సను ఉపయోగించుకోవాలి

**డాక్టర్ కె.ఓంకారనాద్**

ప్రజాశక్తి - గణపవరం

గ్రామ సచివాలయంలో నిర్వహించే చంద్రన్న సంచార చికిత్సను స్థానికులు ఉపయోగించుకోవాలని పిహెచ్‌సి డాక్టర్ కె.ఓంకారనాద్ అన్నారు. శనివారం నాలుగో సచివాలయంలో ఏర్పాటు చేసిన చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమంలో పాల్గొని రోగులకు వైద్యం అందించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్ ఉన్నవారికి మందులందించినట్లు తెలిపారు. గర్భవతులు, బాలింతలకు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ క్యాంపులో 28 సాధారణ కేసులకు వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. మొత్తం 41 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతినెల వైద్య క్యాంపు ఏర్పాటు చేస్తామని అన్నారు. క్యాంపులో 14 రకాల రక్త పరీక్షలు చేసి, 67 రకాల మందులు అందజేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు సిహెచ్.జాలది విల్సన్ బాబు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు, డిప్యూటీ స్పీకర్

## రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - వీరవాసరం

గ్రామీణ ప్రాంతంలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్, ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కీ.శే. కొల్లా భాస్కరరావు, గుండా లక్ష్మీరత్నావతి మెమోరియల్ ఆధ్వర్యాన శనివారం రాష్ట్ర స్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను అంజిబాబు, రఘురామకృష్ణరాజు సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అంటే ఆటల పోటీలే ముఖ్యంగా సాగాలన్నారు. ముఖ్యంగా ఈ పోటీల్లో మహిళలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన సుమారు 26 జట్లకు వంద మంది క్రీడాకారులకు వసతి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలో మరిన్ని సంప్రదాయ క్రీడలను ప్రోత్సహిస్తూ ముందుకు సాగాలని అన్నారు. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖర్, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, వీరవాసరం సొసైటీ ఛైర్మన్ వీరవల్లి శ్రీనివాస్, వైస్ ఎంపిపి అడ్డాల శ్రీరామచంద్రమూర్తి, టిడిపి మండల అధ్యక్షులు కొల్లేపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

## జెవివి సైన్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

**భీమవరం:** స్థానిక మిత్ర మెడి కేర్ హాస్పిటల్ వద్ద జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ వారి సైన్స్ క్యాలెండర్‌ను జెవివి జిల్లా కమిటీ ఆధ్వర్యాన జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ చందాని సాయిబాబు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సైన్స్ క్యాలెండర్ విశ్వ ఆవిర్భావం నుండి జీవం ఏర్పాటు వరకు తెలియజేసే చిత్రాలతో రూపొందించినట్లు తెలియజేశారు. ఈ సైన్స్ క్యాలెండర్‌ను జిల్లాలో గల అన్ని ఉన్నత పాఠశాలలకు అందజేస్తామని తెలిపారు. డాక్టర్ చందాని మల్లీశ్వరి, జిల్లా ఉపాధ్యక్షులు చింతపల్లి ప్రసాదరావు, చెకుమటి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్న బాబు, పి.శ్రీనివాసరాజు, డాక్టర్ ఆరేటి మురళీ, ఇన్‌ఛార్జి వి.రామ్ చరణ్ పాల్గొన్నారు.

## కైలాసధామ్ రథం వితరణ

**ఆచంట:** మండల పరిధిలోని ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం కైలాసధామ్ రథంను వితరణ చేయడం అభినందనీయమని ఆచంట కైలాసధామ్ కమిటీ సభ్యులు గోపవరపు రామచంద్రమూర్తి అన్నారు. శనివారం స్థానిక రామేశ్వర స్వామి ఆలయం ఆవరణ నుండి ఆచంటేశ్వర కైలాస ధామ్ రథాన్ని ప్రారంభించారు. ఆచంట గ్రామానికి చెందిన కీర్తిశేషులు గోపిశెట్టి సూర్యనారాయణ, భార్య సరోజిని దంపతులు జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు గోపిశెట్టి వెంకటేశ్వరరావు, ఉషశ్రీ దంపతులు, మనవడు కౌశిక్(యుఎస్ఏ) రూ.11 లక్షల విలువ గల కైలాస రథం ను, కైలాస ధామం కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైట్ల భాస్కర రావు, బలుసు శ్రీనివాస్, మేకా విన్నబ్బు, గోవాడ్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## డిగ్రీ కాలేజీ సిపిడిసి నూతన కార్యవర్గం ఎన్నిక

**గణపవరం:** గణపవరం డిగ్రీ కళాశాల సిపిడిసి నూతన కార్యవర్గం ఎన్నికైంది. సిపిడిసి ఛైర్‌పర్సన్‌గా కాలేజ్ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి, సెక్రటరీగా కెవిఎస్.సత్యనారాయణ రాజు(అవంతి సత్తిబాబు)తో మరో 14 మంది సభ్యులతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిన్సిపల్ పి. నిర్మలకుమారి తెలిపారు. రానున్న రోజుల్లో కాలేజీ అభివృద్ధికి తమ కమిటీ కృషిచేస్తుందని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# బాలికల విద్యకు సావిత్రిబాయి పూలే కృషి

## పలుచోట్ల జయంతి వేడుకలు

కాళ్లలో..

నరసాపురంలో..

ప్రజాశక్తి - కాళ్ల

సావిత్రిబాయి పూలే మహిళా లోకానికి ఎనలేని సేవలు చేశారని కాళ్ల జెడ్‌పి హైస్కూల్ హెచ్‌ఎం పి.భాగ్యలక్ష్మి గుర్తు చేశారు. కాళ్ల జెడ్‌పి హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి, జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ వేడుకల్లో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ బేతు నాగ వెంకట సుబ్బారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోపల్లె హైస్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఉపాధ్యాయురాలు జి.సుమలత, జి.శైలజ, ఎ.నవీన, బిబి.మణి, ఎ.బేబీలక్ష్మి, డి.కనకదుర్గ, కె.ప్రతిమలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, పి.క్రాంతికుమార్, జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు జి.రామ కృష్ణంరాజు, సిహెచ్.కుమార్ బాబ్జి పాల్గొన్నారు.

**పాలకొల్లు :** పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మహిళా సాధికారిత విభాగం, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ విభాగాల ఆధ్వర్యాన సావిత్రి బాయి పూలే జయంతిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మొదటిగా ప్రిన్సిపల్, ఇతర అధ్యాపకులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ దేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, కవయిత్రి సావిత్రి బాయి పూలే అని, ఆమె బాలికలకు, అణగారిన వర్గాలకు విద్యావకాశాలు కల్పించేందుకు అడ్డంకులు ఛేదించి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యు ఏసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, అకాడమిక్ కోఆర్డినేటర్ వి.యామిని, తెలుగు శాఖాధిపతి డాక్టర్ బూసి వెంకటస్వామి, ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సిహెచ్.ఉషారాణి, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ బికెవి.రామలక్ష్మి పాల్గొన్నారు.

**పోడూరు :** జెడ్‌పిహెచ్‌సి జిన్నూరులో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా పోడూరు యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.శివజ్యోతి మాట్లాడుతూ మహిళలందరూ మహిళా సాధికారత సాధించాలని, విద్య, ధైర్యం, ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పలువురు వక్తలు మహిళల ప్రాముఖ్యతను ప్రశంసించి తదనంతరం ఉపాధ్యాయినులు సిహెచ్.శివజ్యోతి, ఎస్.నాగ పరమేశ్వరి, కె.అరుణ, బి.దేవి సరోజినీలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామభద్రం, రాజశేఖర్, పెద్దిరాజు, నాగరాజు, క్షేమమూర్తి, కుమారస్వామి, తాళబత్తుల వెంకటేశ్వర రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**వీరవాసరం:** సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మహిళా ఉపాధ్యాయినులను సత్కరించారు. పెదపేట ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు యుటిఎఫ్ నాయకులు మాట్లాడారు. జోతిరావు ప్రోత్సాహంతో సాయిత్రిబాయి పూలే ఇంటిలోనే అక్షరాభ్యాసం పూర్తి చేసి విద్యావంతురాలైందన్నారు. అనంతరం పదిహేను మంది మహిళ ఉపాధ్యాయినులను సత్కరించారు. రాష్ట్ర కౌన్సిలర్ జివివి.రామానుజరావు, జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు, మండల అధ్యక్షుడు ఎన్.ప్రసాద్‌బాబు, కె.శ్రీదేవి, వి.రామరమణి, కార్యదర్శి ముద్రగళ శ్రీనివాసరావు, కె.నాగమునేశ్వరావు, యుటిఎఫ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

**పెనుమంట్ర :** దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రి బాయి పూలే ఘనమైన చరిత్ర సృష్టించారని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. విద్య ద్వారా స్త్రీలు ఉన్నంతంగా ఎదగాలని ఆశించి, స్త్రీల జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. శనివారం స్థానిక మండల కేంద్రం పెనుమంట్రలోని ఆర్ఎ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ధర్మవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె. పరమేశ్వర్, జె.యామిని, కె.వెంకట లక్ష్మి, ఐ.సత్యవాణి, ఎం.ఉమా భారతి, ఎస్.పూర్ణిమ, శ్రీనివాసుల రామలక్ష్మి, ఎ.క్లారా గ్రేస్, టి.రత్నకుమారి తదితరులతో పాటు విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పాలకొల్లు రూరల్‌లో..

సావిత్రి బాయి పూలే జీవితం ధన్యమని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పాలా ప్రసాద్ అన్నారు. మండలంలోని వనంపల్లి ప్రైమరీ స్కూల్లో జరిగిన కార్యక్రమంలో మండల మాజీ వైస్ ఎంపిపి కట్టా బాలాజీ వన కుమార్, కె.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నరసాపురం :** సావిత్రి బాయి పూలే 195వ జయంతి సందర్భంగా జాతీయ బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనమాల శ్రీనివాస్ ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వనమాల శ్రీనివాస్ మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, స్త్రీ విద్య కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. 1848లో మహిళల విద్య కోసం స్కూల్ స్థాపించి, ఎన్నో అవమానాలు ఎదురైనా వాటిని తట్టుకుని 4 సంవత్సరాల్లో 20 స్కూల్స్ స్థాపించటం జరిగిందని, ఆడవాళ్లకి చదువు లేకపోతే సమానత్వం లేదని ఆమె స్త్రీ విద్యకు కృషి చేసారని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు సునీత మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు గుడాల సునీత, నియోజకవర్గ అధ్యక్షురాలు వాకా వరలక్ష్మి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మోకా శంకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోలా కనకరాజు, జిల్లా ఉపాధ్యక్షులు అద్దంకి భాస్కర్, యూత్ జిల్లా ఉపాధ్యక్షులు కోప్పడి ప్రభు, కామడి గంగాధర్, ఉమా మహేశ్వరరావు, గుడాల నాని పాల్గొన్నారు.

వేములదీవి గ్రామంలోని కాపులకొడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు హాజరై మాట్లాడారు. స్త్రీ విద్యకు దిశానిర్దేశం చేసి, సామాజిక న్యాయ పోరాటానికి పునాది వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాగిడి రాంబాబు, దొంగ మురళీ, హెచ్‌ఎం వీరవల్లి నాగేశ్వరరావు, బాలం ప్రతాప్, సంకరపు వెంకటేశ్వర్లు, నంద్యాల హనుమంతు, మైలా జయరాం పాల్గొన్నారు.

పాలకొల్లులో..

**పాలకొల్లు రూరల్ :** మండలంలోని పెదగరువు ప్రాథమిక పాఠశాలలో సావిత్రి బాయి పూలే 195వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దిగమర్రు కాంప్లెక్స్ ఛైర్మన్ కె.శ్రీనివాస్, పెదమామిడిపల్లి ఉపాధ్యాయురాలు ప్రతూష హాజరయ్యారు. మహిళ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయురాలు ప్రతూషను ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్ కె.విజయలక్ష్మి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేతల రాఘవరావు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్త్రీలకు విద్య కోసం, అణగారిన వర్గాల ఉన్నతి కోసం ఎంతగానో కృషిచేశారని, చదువు వల్ల ఎన్నో ఇబ్బందులను, ఆటంకాలను ఎదుర్కోగలుగుతామని విద్యార్థులకు తెలియజేశారు. విచ్చేసిన అతిథి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్య ఆవశ్యకత, చదువు వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పంపన లక్ష్మీనారాయణ, పందిగుంట ప్రధానోపాధ్యాయులు నిల్ల సురేష్ బాబు, గ్రామ పెద్దలు దుక్కిపాటి శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** జ్యోతిబాయి పూలే సహకారంతో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి బాలికల విద్యకు కృషిచేసిన మహనీయురాలు, మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు బయటకు రాకూడదని, కట్టుబాట్లు ఉన్న ఆ కాలంలో 17 సంవత్సరాల వయసులోనే సావిత్రిబాయి పూలే భర్త జ్యోతిబాపూలే అడుగుజాడల్లో నడిచి మహిళల విద్యకు బాటలు వేసిన గొప్ప మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. పట్టణ జనసేన అధ్యక్షులు వర్ధనపల్లి కాశీ మాట్లాడారు. అనంతరం ఎంఇఒ జ్యోతిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డివైఇఒ రామాంజనేయులు, ఎంఇఒలు వి.హనుమ, పి.జ్యోతి, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జి ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే 195వ జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, కళ్యాణం రామచంద్రరావు, దాట్ల జగన్నాథరాజు పాల్గొన్నారు.

**43 మంది మహిళా ఉపాధ్యాయురాలకు సత్కారం**

**పాలకొల్లు :** స్థానిక బివిఆర్ఎం గర్ల్స్ హై స్కూల్లో యుటిఎఫ్ పాలకొల్లు పట్టణం ఆధ్వర్యాన సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 43 మంది మహిళా ఉపాధ్యాయినులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కె.త్రినాథ్, పట్టణ అధ్యక్షులు ఎం.శ్రీనివాస రావు, జిల్లా కార్యదర్శులు జి.లక్ష్మీ నారాయణ, డి.యేసు బాబు, ప్రధానోపాధ్యాయులు వై.ప్రభాకర శాస్త్రి, ఎస్.ఝాన్సీ లక్ష్మీబాయి, సిహెచ్.ప్రభావతి, పట్టణ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పారిశుధ్య సమస్య పరిష్కారానికి చర్యలు

## టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇర్రింకి సత్యనారాయణ

ప్రజాశక్తి - ఉండి

గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య నివారణే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి ఇర్రింకి సత్యనారాయణ(బుజ్జి) అన్నారు. శనివారం మండలంలోని చెరుకువాడ గ్రామ పరిధిలో స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు సూచనల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాషిణి ఆధ్వర్యాన చెత్త వేయడం చట్టరీత్యా నేరం, శిక్షార్హులు అనే హెచ్చరిక బ్యానర్లను పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై పారవేయడం వల్ల పారిశుధ్య సమస్య ఏర్పడుతుందని, దీనివల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడి ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు వివరించారు. దీనిని నివారించేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యాన ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని, అందులో భాగంగా పలు ప్రాంతాల్లో హెచ్చరిక బ్యానర్లు ఏర్పాటుచేసి ప్రజలకు పారిశుధ్య సమస్య వల్ల ఏర్పడే ఇబ్బందుల గురించి అవగాహన కల్పించి, పంచాయతీ బండికి చెత్త అందించాలని తెలియజేశారు. అదేవిధంగా కలిసిపూడి వంతెన వద్ద నుంచి చెరుకువాడ శివారు వరకు పంటకాల్వ వెంబడి ఉన్న చెత్తా చెదారాన్ని జెసిబి సహాయంతో తొలగిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జెసిబితో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న టిడిపి నేతలు

## యూరియా కొరత లేదు

**ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ**

ప్రజాశక్తి - పెనుమంట్ర

దాల్వా పంటకు యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన పడవద్దని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలో సొసైటీలు, ఎరువుల షాపుల్లో 325 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఎక్కడైనా డీలర్లు గాని, సొసైటీలో గాని కృత్రిమ కొరత సృష్టించి యూరియా అడ్డదారుల్లో విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందుబాటులో యూరియా ఉండగా, దొరకదేమోనని ముందుగా వచ్చిన రైతులు అవసరం కంటే ఎక్కువ బస్తాలు తీసుకొని వెళితే, వెనుక వచ్చిన రైతులకు స్టాక్ నిల్ బోర్డు ఉంటుందని ఆయన అన్నారు. రైతులు ఒకరికి ఒకరు సహకరించుకొని, తమ పొలాలకు ఎంత అవసరమో అన్ని బస్తాలు తీసుకు వెళ్లడం వల్ల కొరత అనే సమస్య ఉండదన్నారు. పొలాల్లో పంటకు అవసరానికి మించి యూరియా వినియోగించడం వల్ల నష్టం తప్ప లాభం ఉండదని ఎంఎల్ఎ పితాని అన్నారు.

## రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - గణపవరం

కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీని నిలపెట్టుకుందని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం మండలంలోని గణపవరం, సరిపల్లి, చిలకంపాడు గ్రామాల్లో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం రాజముద్రతో కూడిన పుస్తకాలు ఇవ్వకుండా, జగన్మోహన్ రెడ్డి ఫొటో ఉన్న పుస్తకాలు ఇవ్వటం వల్ల ప్రజలు ఆందోళన చెందారన్నారు. అందుకే రైతులు తిరగబడ్డారన్నారు. 1971 చట్టం ప్రకారం రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రాజకీయ పార్టీ చిహ్నాలు, పేర్లు తొలగించి రాజముద్ర కూడిన కొత్తపుస్తకాలు ప్రభుత్వం అందచేయటం జరుగుతుందని తెలిపారు. స్థానిక సచివాలయాల వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.


పాస్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

# 70 కొబ్బరి చెట్ల ఫలసాయం స్వాహా

## స్థానిక అధికారుల అవినీతిపై ఆరోపణ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని నెగ్గిపూడి(మార్టేరు)లో ఉన్న శ్రీవేణుగోపాల జిల్లా పరిషత్ హై స్కూల్లో ఉన్న సుమారు 70 కొబ్బరి చెట్ల ఫల సాయంను జిల్లా పరిషత్తుకు జమ చేయకుండా, స్థానిక అధికారులు అవినీతికి పాల్పడి తమ సొంతానికి జమ చేసుకుంటున్నారని మండల జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి ఆరోపించారు. ఈమేరకు శనివారం ఆమె మాట్లాడుతూ ఈ విషయం మీద విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు పంపినట్లు తెలిపారు. తగు చర్యలు గూర్చి నెగ్గిపూడి జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలోను, క్రీడలు నిర్వహించే గ్రౌండ్లో సుమారు 71 కొబ్బరి చెట్ల ఫల సాయం వస్తుందని, గతం నుండి కూడా ఈ చెట్ల ద్వారా వచ్చే ఫలసాయం ఆదాయం జిల్లా పరిషత్ హై స్కూల్ అభివృద్ధికి, లేదా సంబంధిత మండలంలోని అధికారి ఖాతాకు జమ చేయాలని అన్నారు. ఈ స్కూల్లో పనిచేస్తున్న ఒక ఉద్యోగి అధికారుల అనుమతి లేకుండా, పంచాయతీ, మండలం, జిల్లా పరిషత్ తీర్మానం లేకుండా సొంత ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. గత నెల అక్టోబర్ 2025 మొదటి వారంలో సుమారు 3 వేల కొబ్బరికాయలు దింపు జరిగిందని, అప్పటి మార్కెట్ రేటు కాయ ఒకటికి రూ.30 ఉండగా హోల్‌సేల్‌గా కాయ ఒకటికి రూ.20 చొప్పున మొత్తం కలిపి సుమారు రూ.60 వేల ఆదాయం వచ్చిందన్నారు. ఈ డిసెంబరు 25వ తేదీ స్కూల్ సెలవు రోజున సుమారు 2 వేల కాయలకుపైగా కొబ్బరికాయల దింపు జరిగిందని, అప్పటి మార్కెట్ రేటు ఒకటి రూ.20 ఉండగా హోల్‌సేల్‌గా కాయ ఒకటికి రూ.10 చొప్పున మొత్తం కలిపి సుమారు రూ.20 వేల ఆదాయం వచ్చి ఉందన్నారు. ఇది ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగానికి, ఆర్థిక అక్రమాలకు దారితీసే చర్యలుగా భావించబడుతుందని, దీనివల్ల స్కూల్ అభివృద్ధికి రావలసిన నిధులు నష్టపోతున్నారని ఆమె వాపోయారు. ఈ విషయమై పాఠశాల గత ఎయిడెడ్ యాజమాన్యం నుండి జిల్లా పరిషత్‌కు హ్యాండ్ ఓవర్ అయినప్పటి నుంచి వచ్చిన కొబ్బరిచెట్ల ఫలసాయ ఆదాయంపై విచారణ చేపట్టాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. అంతేకాక అప్పటి నుండి ప్రతీ ఏటా కొబ్బరి చెట్ల ద్వారా వచ్చిన ఆదాయంపై ఆడిట్ నిర్వహించాలని, ఈ విషయంలో తప్పు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఈ తరహా అక్రమాలు జరగకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జెడ్‌పిటిసి గౌరీ సుభాషిని డిమాండ్ చేశారు.

## ఎఐఎస్ఎ క్యాలెండర్ ఆవిష్కరణ

**భీమవరం:** ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్(ఎఐఎస్ఎ) 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ని విద్యార్థి సంఘం నాయకుల సమక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారి, డిఇఒ నారాయణ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువు పట్ల ఆసక్తి కనబరచాలని ఆకాంక్షించారు. ఎఐఎస్ఎ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి మాట్లాడుతూ విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయస్థాయిలో ఐసా నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఐసా జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లూరి రాంప్రసాద్, యు.మురళీ పాల్గొన్నారు.

## మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.1,02,81,455 కోట్లు

**భీమవరం టౌన్:** భీమవరం పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో హుండీ ఆదాయం లెక్కించారు. 105 రోజుల కాలానికి హుండీల ద్వారా మొత్తం ఆదాయం రూ.1,02,81,455 అక్షరాలా కోటి రెండు లక్షల ఎనభై ఒక వేయి నాలుగు వందల యాభై ఐదు రూపాయలు వచ్చాయి. భక్తులు బంగారం 215 గ్రాముల 200 మిల్లీగ్రాములు, 360 గ్రాముల వెండి, పలు దేశాల విదేశీ కరెన్సీ సమర్పించుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్ ఆధ్వర్యాన జరిపిన ఈ లెక్కింపులో ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, భీమవరం దేవదాయ ధర్మదాయశాఖ తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు, శక్తీశ్వర స్వామి దేవస్థానం ఇఒ దండు కృష్ణంరాజు, భీమేశ్వర స్వామి దేవస్థానం ఇఒ తోట శ్రీనివాస్, చిక్కాల దేవస్థానం ఇఒ కడలి సాగర్, యూనియన్ బ్యాంకు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలియజేశారు. భక్తుల విశేష అద్భుతమైన ఆదరణ వల్ల ఆదాయం భాగానే సమకూరడం పట్ల భక్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## మద్యం తాగి డ్రైవింగ్ చేయొద్దు

**ఆర్‌టిఒ అధికారి అజ్మీర్ బద్దు**

**పాలకొల్లు :** డ్రైవింగ్ చేసేటప్పుడు తాగి డ్రైవింగ్ చేయరాదని పాలకొల్లు ఆర్‌టిఒ అధికారి అజ్మీర్ బద్దు చెప్పారు. 37వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా పాలకొల్లు టాక్సీ స్టాండ్‌లో ఓనర్స్ కం వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన పాలకొల్లు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అజ్మీర బద్దు రహదారి భద్రత నియమాలు వివరించారు. ముఖ్యంగా డ్రైవింగ్ చేసే సమయంలో రాష్ డ్రైవింగ్ చేయరాదని, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, డ్రైవర్లందరికీ అవగాహన సదస్సు నిర్వహించారు.

**CHANGE OF NAME**

I NIHAL KUMAR VIMAL KUMAR JAIN S/o Vimal Kumar Misrimal Jain D.No. 6-14-2, Kavali Adinarayana Street, Narasapuram-534275, W.G.Dt, A.P. I have changed my Name from NIHAL KUMAR VIMAL JAIN (Old Name) to NIHAL KUMAR VIMAL KUMAR JAIN (New Name). Henceforth I am being called NIHAL KUMAR VIMAL KUMAR JAIN S/o Vimal Kumar Misrimal Jain, for all purposes.

**దస్తావేజులు పోయినవి**

పూసరపు వెంకటేశ్వరరావు తండ్రి వీర్రాజు డోర్‌నెం.2-11-6/4, శాంతినగర్ ఆపోజిట్ సిద్ధార్ధ పిల్లల హాస్పటల్,పాటిమీద, నిడదవోలు పట్టణ వాస్తవ్యులు తూర్పుగోదావరి జిల్లా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా స్థలమునకు సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నెం.2424/1991లు గల ది.15-08-2025 తేదీన ఉదయం 11.00గం॥లకు భీమడోలు సెంటర్ నందు టీ త్రాగుటకు కారు ఆపినాము. ఆసమయములో అచ్చట ఒరిజినల్ లింకు డాక్యుమెంటు వున్న కవరు పడిపోయినది. ఎంత వెతికినా దొరకలేదు. కావున ఎవరికైన దొరికిన యెడల ఈ దిగువ అడ్రస్‌నకు తెలియజేయవలసినదిగా కోరుచున్నామయు.

పూసరపు వెంకటేశ్వరరావు
తండ్రి వీర్రాజు డోర్‌నెం.2-11-6/4,
శాంతినగర్ ఆపోజిట్ సిద్ధార్ధ పిల్లల హాస్పటల్,
పాటిమీద, నిడదవోలు.
సెల్.9397112345,9849714575

**దస్తావేజులు పోయినవి**

ఏలూరు జిల్లా, పోలవరం మండలం, పైడిపాక గ్రామానికి చెందిన గంగుల ప్రభావతి W/o.శ్రీనివాసరావులకు చెందిన దస్తావేజు నెంబర్ 1672/2016 సర్వే నెంబరు 390/1ఎలో 0.56సెంట్లు గల దస్తావేజు ఏలూరు జిల్లా కామవరపుకోట నుండి జంగారెడ్డిగూడెం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా పోయినవి దొరికిన వారు కింది అడ్రస్‌కు అందించగలరు.

పోన్ నెంబర్ 9912129240

వేలం ప్రకటన
మహారాజశ్రీ నూజివీడు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.10/2024
O.S.234/2016
Between:
సమ్మెట ఝాన్సీరాణి మరియిద్దరు ....DHrs
Vs
కలపాల వరమ్మ మరి యొకరు ..... J. Drs
ఈ J.Dr లచే తనఖా ఏర్పరిచిన దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తి ది.10-02-2026 వ తేదీన ఉదయం గం. 10.30 ని॥ల లగాయితు పైకోర్టు వారిచే పైకోర్టులో వేలం వేయబడును. కావలసిన వారు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును.
షెడ్యూలు :పూర్వం కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, నూజివీడు సబ్ రిజిస్ట్రార్ ఇలాకా, ఆగిరిపల్లి మండలం, పోతవరప్పాడు గ్రామంలోని లోని BR.S.No.198/2A లోని ఎ 0.79 సెం మరియు BR.S.No. 198/2E లోని ఎ 0.89 సెం. వెరశి ఎ 1.68 సెం భూమికి హద్దులు:
తూర్పు: మండా అబ్రహాం గారి భూమి
దక్షిణం: లింగంపల్లి ప్రకాష్ గారి భూమి
పడమర: కంభంపాటి ధర్మారావు గారి భూమి
ఉత్తరం: పోతవరప్పాడు పొలిమేర
ఈ హద్దుల మధ్యన గల ఎ 1-68 సెం భూమికి
D.Hr విలువ రూ. 20,00,000/-
అమీనా విలువ రూ. 30,00,000/-
వేలం తేదీ : 10-02-2026
Further hearing Date :17.02.2026
నూజివీడు ఎస్.వి.భవాని కుమార్,
ది.05-01-2026 న్యాయవాది, నూజివీడు.